ప్రజాశక్తి
గురువారం 20 మార్చి 2025
5
కర్నూలు

పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

'ఉపాధి' వేతన వెతలు..

9 వారాలుగా కూలీలకు వేతనాలు పెండింగ్

భారంగా మారుతున్న కుటుంబ పోషణ

ఉపాధి హామీ కూలీల జీవనం కష్టాల కడలిగా మారుతోంది. చేసిన పనికి వెంట వెంటనే వేతనాలు చెల్లించాలని చట్టంలో నిబంధనలు ఉన్నా అవి ఏమాత్రం అమలు కాకపోగా నీరుగారిపోతున్నాయి. చెమటోడ్చి చేసిన పనికి రావాల్సిన వేతనాల కోసం కూలీలు ఎప్పుడెప్పుడా అంటూ ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది. కర్నూలు మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధి పనులు చేసిన కూలీలకు 9 వారాలుగా వేతనాలు చెల్లించ లేదు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారింది కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

గ్రామాల్లో వలసలను నివారిస్తూ వ్యవసాయ కార్మికుల జీవన భృతికి ఉపయోగపడేలా ప్రభుత్వం మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా వంద రోజులు వ్యవసాయ కార్మికులకు పనిని కల్పించి పేద కుటుంబాలకు వేతనం చెల్లిస్తూ ఆదుకోవాల్సి ఉంది. చట్టంలో అయితే హామీ ఉంది తప్ప అది ఏ మాత్రం నెరవేరడం లేదన్న సత్యం ప్రస్తుత ఉపాధి హామీ పనుల్లో కనిపిస్తోంది. కర్నూలు మండల పరిధిలో సుమారు 11 వేల మంది జాబ్ కార్డులు కలిగి ఉన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు దాదాపు 5 వేల మంది ఉపాధి పనులను చేశారు. వీరికి సుమారు ఇప్పటి వరకు 9 వారాలు పైబడి పనులు పూర్తి చేశారు. మండలంలో సగటున రూ.265 రోజుకు వేతనం పడుతోంది. ఈ లెక్కన మండలంలో 32 వేల పని దినాలు పూర్తయ్యాయి. 9 వారాలకు వారికి చెల్లించాల్సిన కూలీల మొత్తం సుమారు రూ.84 లక్షల 8 వేలు మండలంలో ఉపాధి హామీ కూలీలకు బకాయి కింద వేతనాలు చెల్లించాల్సి ఉంది. ఇందులో ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడం సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది. తద్వారా పేదలు తమ కనీస అవసరాలను కూడా తీర్చుకోవడానికి ఆర్థికంగా వెసులబాటు లేకుండా పోతోంది. దీంతో వ్యవసాయ కార్మికులు తమ వేతనాల కోసం ఎదురుచూపులు చూడాల్సి వస్తుంది. ముఖ్యంగా మహిళలు డ్వాక్రా గ్రూపుల్లో తీసుకున్న అప్పులు వడ్డీలు చెల్లించడానికి అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా పిల్లల చదువులకు సంబంధించి ఫీజులు, ఇతర అవసరాలను తీర్చుకోవడానికి వీలు లేకుండా పోతుందని పలువురు ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉపాధి కూలీలను ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని కోరుతున్నారు.

వేతనం ఇవ్వకుంటే బతికేది ఎట్లా..?

9 వారాలకు పైబడి పని చేసినా వేతనాలు ఇవ్వడం లేదు. ఇలాగైతే మేము బతికేది ఎట్లా? కుటుంబాన్ని పోషించుకోవడం ఎలా సాధ్యమవుతుంది. పిల్లల స్కూల్ ఫీజులు, పొదుపు డబ్బులు కట్టుకోలేకపోతున్నాం.

- కాశింబి, పూలతోట గ్రామం, కర్నూలు మండలం.

3 నెలలుగా పైసా కూలి చెల్లించలేదు

మూడు నెలలకు పైగా ఉపాధి హామీ పథకం పనులను చేస్తూనే ఉన్నాం. ఇప్పటివరకు ఒక్క పైసా కూడా ప్రభుత్వం వేతనాలు చెల్లించలేదు. చేసిన పనికి కూలి లేనప్పుడు పనికి వెళ్లడం దేనికంటూ ఇంట్లో తిట్లు తప్పడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం వేతనాలు చెల్లించాలి.

- పద్మావతి, గొందిపర్ల గ్రామం, కర్నూలు మండలం.

పెండింగ్ వేతనాలను విడుదల చేయాలి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కూలీలు పని చేసిన పని దినాలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలి. ఉపాది కూలీల రెక్కల కష్టాన్ని ప్రభుత్వం చెల్లించకుండా దాచుకోవడం సిగ్గుచేటు.

- శ్రీరాములు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు.

పది పరీక్షా కేంద్రాలను కలెక్టర్ పరిశీలన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో పదవ తరగతి పరీక్షలు బుధవారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. కర్నూల్ నగరంలోని రాజానగర్‌లో గల బిషప్ సెంట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, గౌతమి నగర్‌లోని గుడ్ షెఫర్డ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న తీరును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 172 పరీక్ష కేంద్రాలలో 40,776 మంది విద్యార్థులకు 40,568 మంది విద్యార్థులు హాజరయ్యారని, 208 మంది గైర్హాజరయ్యారని డిఇఒ శామ్యూల్ పాల్ తెలిపారు.

22న ఓర్వకల్లులో డిప్యూటీ సిఎం పర్యటన

- కలెక్టర్ పి.రంజిత్ బాష

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టర్

ఈ నెల 22న ఓర్వకల్లులో డిప్యూటీ సిఎం పవన్ కళ్యాన్ పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. డిప్యూటీ సిఎం పర్యటన సందర్భంగా ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ బుధవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా రాబోయే జూన్‌లోపు రెండు లక్షల పారం పాండ్స్‌లను పూర్తి చేయాలన్న లక్ష్యంతో నిర్మిస్తున్న సందర్భంగా కర్నూలు జిల్లాలో డిప్యూటీ సీఎం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారని చెఅప్పరు. ఇందులో భాగంగా కర్నూలు జిల్లాలో 8500 ఫారంపాండ్స్ నిర్మిస్తారని, ఓర్వకల్లు మండలం పూడిచర్ల గ్రామ పరిధిలో ఫారంపాండ్‌కు డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ భూమిపూజ చేయనున్నట్లు వెల్లడించారు. బందోబస్తు, స్టేజ్ అరేంజ్మెంట్స్, బ్యారికేడింగ్, బహిరంగ సభ ప్రాంతంలో పారిశుధ్య ఏర్పాట్లు, సౌండ్ సిస్టమ్, శిలాఫలకం, బ్యాక్ డ్రాప్, తాగునీటి సరఫరా తదితర ఏర్పాట్లన్నీ గురువారం సాయంత్రానికి ఒక కొలిక్కి రావాలని, శుక్రవారం సాయంత్రంలోపు పూర్తి చేయాలని కర్నూలు ఆర్‌డిఒ, జడ్పీ సీఈవో, పిడి డ్వామా, ఎస్ఈ, ఆర్ అండ్ బి, పిడి డిఆర్డిఏ, పిడి మెప్మా, డిఎస్పీ, జడ్పీ సీఈవో, ఎస్ఈ ఆర్డబ్ల్యుఎస్, ఓర్వకల్లు తహసిల్దార్, ఎంపీడీవోలను ఆదేశించారు. ఈ అధికారులందరూ బుధవారం సాయంత్రం పూడిచెర్ల గ్రామానికి వెళ్ళి ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో జెసి బి.నవ్య, డిఆర్వో వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్డీవో సందీప్, జడ్పీ సీఈవో నాసర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈవిఎం వేర్ హౌస్‌ను కలెక్టర్ పరిశీలన : త్రైమాసిక తనిఖీలో భాగంగా ఈవిఎంల గోదామును రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ పరిశీలించారు. ఈవిఎం వేర్‌హౌస్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న పోలీసు గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, అధికారులను ఆదేశించారు. అనంతరం సంబంధిత రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. కలెక్టర్ వెంట డిఆర్వో సి.వెంకటనారాయణమ్మ, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ మురళి, టిడిపి ఎల్.వి.ప్రసాద్, బిజెపి సాయి ప్రదీప్, బీఎస్పీ అరుణ్ కుమార్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ఎన్‌సిహెచ్ బజారన్న తదితరులు పాల్గొన్నారు.

రవాణా రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ

- ఛలో ఢిల్లీ ప్రచార జీపుజాతా ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఆటో, లారీ ఇతర రంగాల కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్. రాధాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటో, లారీ ఇతర రంగాల కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం కోసం ఆల్ ఇండియా ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్, సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రచార జీపుజాతాను బుధవారం నగర పరిధిలోని సుందరయ్య సర్కిల్‌లో సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ అధ్యక్షత వహించారు. పిఎస్ రాధాకృష్ణ మాట్లాడుతూ దేశంలో సరుకు, ప్రజా రవాణా ద్వారా ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు సమకూర్చే రవాణా రంగం పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. డ్రైవర్ల సంక్షేమానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని చెప్పారు. వారి సంక్షేమం కోసం బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం ప్రభుత్వాలకు పరిపాటిగా మారిపోయిందన్నారు. ప్రభుత్వాలు వివిధ జీవోలు, భయంకరమైన సెక్షన్ల ద్వారా డ్రైవర్ల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వాహనాల ఎఫ్సీలను ప్రైవేటీకరిస్తూ ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్లను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పే విధానాన్ని తక్షణం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలపై పోరాటాలు చేయడమే ఏకైక మార్గమని, ఈనెల 24న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమంలో అధిక సంఖ్యలో రవాణా రంగ కార్మికులు పాల్గొనాలని కోరారు. కర్నూల్‌లో ప్రారంభించిన ప్రచార జీపుజాతా గూడూరు, బెళగల్, ఎమ్మిగనూరు, కోసిగి, ఆదోని, ఆలూరు, ఆస్పరి, పత్తికొండ, కోడుమూరు మీదుగా కర్నూలు చేరుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి పి.మహమ్మద్, ఎస్. హుస్సేన్ వలి, నగర నాయకులు నభి, మళ్లీ, నాగరాజు, మధు, చిన్న, కరుణ, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ప్రచార జీపుజాతాను ప్రారంభిస్తున్న పిఎస్ రాధాకృష్ణ

తాగునీటికి తీవ్ర ఇబ్బందులు

- బోరు నీరు, ఫిల్టర్ వాటర్ ఒకే పైపులో వస్తున్నాయి..

- కార్పొరేషనలో కలిసినా ఎక్కడి సమస్యలు అక్కడే

- సిపిఎం ప్రజా చైతన్యయాత్రలో పెద్దపాడు గ్రామస్తులు ఆవేదన

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

'కార్పొరేషన్‌లో విలీనమై 10 సంవత్సరాలవుతున్నా పెద్దపాడు గ్రామం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం' అని పెద్దపాడు గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని పెద్దపాడు గ్రామంలో సిపిఎం 36వ వార్డు కమిటీ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజలు సిపిఎం ప్రతినిధి బృందానికి అనేక సమస్యలు వివరించారు. 'తాగేందుకు మంచి నీళ్ల కూడా అందించలేని దుస్థితిలో అధికారులు ఉన్నారు. ఫిల్టర్ చేసిన నీటిని, బోర్ నీటిని కలిపి ఒకే పైపులైన్‌లో అందిస్తున్నారు. ఫలితంగా అనారోగ్యాలకు గురవుతున్నాం. రెండు రోజులకు ఒకసారి మున్సిపల్ వాటర్ గంటసేపు మాత్రమే వస్తున్నాయి. నీటి ట్యాంకర్లపై ఆధార పడాల్సి వస్తుంది. డిప్యూటీ మేయర్ ఇంటి పక్కనే వారి ఇంటి వరకు మాత్రమే సీసీ రోడ్డు వేసుకొని పేదలు నివసించే ప్రాంతాన్ని వదిలేశారు.సిసి రోడ్డు, డ్రైనేజీ కాలవ నిర్మాణం చేపట్టలేదు. ఒడ్లోని వంక స్థలం రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేసి ప్లాట్లు వేసుకుని అమ్ముకుంటున్న విషయాన్ని కలెక్టర్, అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకుపోయినా ఎలాంటి చలనం లేదు. దాని కారణంగా చిన్న వర్షం వస్తే వర్షపు నీరు పెద్దపాడులో ఎస్సీ కాలనీ మొత్తం మునిగిపోతుంది. వడ్లోని వంక స్థలాన్ని కాపాడి, వంకకు రెండు వైపులా ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలి' అని గ్రామస్తులు సిపిఎం నాయకులకు సమస్యలను విన్నవించారు. అనంతరం సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి టి రాముడు మాట్లాడుతూ కర్నూల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ 36వ వార్డు పెద్దపాడులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఈ నెల 26వ తేదీ చేపట్టే ధర్నాలో ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఎం వార్డు కార్యదర్శ ఎన్.గోపీనాథ్, కే.శీను, యేసురాజు, బట్టు మద్దిలేటి, పి.నాగరాజు, కృష్ణ, రమేష్, జయన్న, ఎన్.మద్దిలేటి, పెద్ద సుంకన్న, రవి తదితరులు. పాల్గొన్నారు.

పెద్దపాడులో సిమెంట్ రోడ్డు లేదని చూపుతున్న సిపిఎం ప్రతినిధి బృందం

మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ డాక్టర్ శాంతి కళ

వైద్య సేవలు ప్రభుత్వ పోర్టల్‌లో ఎక్కించాలి

- ప్రయివేట్ ఆస్పత్రుల యాజమాన్యంతో డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ప్రయివేట్ ఆస్పత్రుల్లో నిర్వహించే వైద్య సేవల గురించి ప్రభుత్వ పోర్టల్‌లో ఎక్కించాలని డిఎంహెచ్ఒ డాక్టర్ పి.శాంతికళ తెలిపారు. బుధవారం ప్రయివేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రయివేట్ ఆస్పత్రుల్లో జరిగిన ప్రసవాలు, ఇతర ఆరోగ్య సేవల వివరాలను ప్రతినెలా 3న హెచ్ఎంఐఎస్ (హెల్త్ మేనేజమెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్) పోర్టల్, సిఆర్ఎస్ (సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్) పోర్టల్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని తెలిపారు. దీని కోసం ప్రతి ప్రయివేట్ ఆస్పత్రిలో ఒకరికి బాధ్యత అప్పగించాలని చెప్పారు. సిజేరియన్ కాన్పులు ఎక్కువగా జరిగే ఆస్పత్రులను ప్రోగ్రాం అధికారులతో ఆడిట్ నిర్వహించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఘనంగా 'గీతాంజలి నర్సింగ్' ఫేర్‌వెల్



ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నగరంలోని గాయత్రి ఎస్టేట్స్‌లో ఉన్న గీతాంజలి నర్సింగ్ కళాశాలలో 2020-21వ బ్యాచి విద్యార్థులు శిక్షణ కాలం ముగియడంతో బుధవారం కళాశాల క్యాంపస్‌లో ఫేర్‌వెల్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కళాశాల ఛైర్మన్ పెరుగు విజయ్ వర్ధన్ రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు చక్కని నడవడిక, క్రమశిక్షణ, సేవాభావంతో ముందుకు సాగాలని తెలిపారు. ప్రస్తుత స్థితిలో క్షణికావేశాలకు గురికావద్దని చెప్పారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్‌తో పాటు ప్రతి విద్యార్థికి కళాశాల యాజమాన్యం ఎగ్జిక్యూటివ్ ఫైల్‌ను బహుమతిగా ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపల్ వసంతకుమారి, కిమ్స్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ అర్చన మాట్లాడుతూ... నర్సింగ్ విద్యార్థులు సమాజానికి మంచి సేవలు చేసి పేరు గడించాలన్నారు. అధ్యాపకులు కె.సురేఖ, సింధూజ, స్వప్న, ఎస్.సురేఖ, నిర్మల, సంధ్యారాణి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : డిఇఒ

కర్నూలు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా ప్రయివేటు పాఠశాలలు ఒంటి పూటబడుల నిర్దిష్ట వేళలు పాటించకుండా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామ ని డిఇఒ శామ్యూల్ పాల్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయంపై తమ దృష్టికి వస్తే పాఠశాలల మూసివేతకు ఆదేశాలు ఇస్తామని హెచ్చరించారు. ఒంటిపూట బడులకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన సమయం పాటించాలన్నారు.

టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేయాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

- సిపిఐ ఆధ్వర్యంలో టిడ్కో గృహ సముదాయం పరిశీలన

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

పేదల కోసం ప్రభుత్వం నిర్మించిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు తక్షణమే అందజేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. నగర శివారులో నిర్మించిన టిడ్కో గృహాల సముదాయాన్ని బుధవారం ఆయన పరిశీలించి, అక్కడ నివాసముంటున్న ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు 2017లో పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని టిడ్కో పేరుతో గృహాలు నిర్మించారని తెలిపారు. నగరంలో సుమారు 10,400 గృహాల నిర్మాణం రూ.575 కోట్లతో చేపట్టినట్లు చెప్పారు. 90 శాతం పూర్తయిన గృహాలను ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పట్టించుకోక పోవడం, అద్దె చెల్లించలేక, లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ఇప్పటికే ఇంటి అద్దె చెల్లించలేని సుమారు 130 మంది లబ్ధిదారులు వారికి కేటాయించిన గృహాల్లో నివాసం ఉంటున్నారని తెలిపారు. రాత్రి వేళల్లో విషసర్పాలు వస్తున్నాయని, నీరు రోజుమార్చి రోజు వస్తున్నాయని చెప్పారు. టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు కేటాయించాలని కోరారు. అనంతరం టిడ్కో అధికారి రవికుమార్ గుప్తతో మాట్లాడి, టిడ్కో గృహాల మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, సీనియర్ నాయకులు కె.జగన్నాథం, నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శులు సి.మహేష్, డి.శ్రీనివాసరావు, నగర కార్యవర్గ సభ్యులు బీసన్న, నల్లన్న, అన్వర్, సోమన్న, నాగరాజు, కుమార్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శరత్ కుమార్, నగర అధ్యక్ష, కార్యదర్శులు అభి, అశోక్, ఎఐటియుసి నాయకులు రామాంజనేయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను అభివృద్ధి చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను అభివృద్ధికి పేద విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి రాఘవేంద్ర, నగేష్ కోరారు. బుధవారం వారు మాట్లాడారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాష్ట్రంలో విదేశీ యూనివర్సిటీలను తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని, అందు కోసం ప్రవేట్ విశ్వవిద్యాలయాల స్థాపన క్రమబద్ధీకరణ సవరణ బిల్లు 2025ను శాసనసభలో ప్రవేశపెట్టడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ యూనివర్సిటీల అభివృద్ధి మీద ధ్యాస లేకుండా ప్రవేట్ యూనివర్సిటీలపై మోజు పెంచుకోవడమే అన్నారు. బిల్లు పెట్టగానే బిట్స్ యూనివర్సిటీకి 70 ఎకరాల భూమిని కేటాయిస్తున్నట్టు ప్రకటించడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో ఏ యూనివర్సిటీకి వెళ్లినా ఖాళీ పోస్టులతో, కనీస వసతుల్లేక పాడుబడిన బిల్డింగ్‌లే దర్శణమిస్తున్నాయన్నారు. పేద, మధ్య తరగతి వర్గాల విద్యార్థులకు విద్యాభివృద్ధికి ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు మహర్దశ కల్పించాలని కోరారు. విదేశీ యూనివర్సిటీల అనుమతిని నిరాకరించాలని, ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. లేని ఎడల ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు.

సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడండి

- కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ క్రాంతి నాయుడు

ప్రజాశక్తి - పత్తికొండ

పత్తికొండ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యే కెఇ.శ్యామ్ కుమార్ అసెంబ్లీలో మాట్లాడి నిధులు తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ క్రాంతి నాయుడు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడారు. పాలిటెక్నిక్, ఐటిఐ వృత్తి కోర్సులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ కాంగ్రెస్ పోరాట ఫలితమేనని అన్నారు. రాబోయే సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధమవుతామని అన్నారు.

22 నుంచి కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తులు : ప్రిన్సిపల్ జ్యోతి

ప్రజాశక్తి - మద్దికెర

కెజిబివిలో ప్రవేశాలకు ఈనెల 22 నుంచి ఏప్రిల్ 11లోపు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ జ్యోతి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడారు. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరానికి 6, 11వ తరగతుల్లో ప్రవేశాల కోసం 7, 8, 9, 10, 12వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అనాథలు, బడి బయటి పిల్లలు, బడి మానేసిన పిల్లలు, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బిపిఎల్, బాలికలు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసిన విద్యార్థులు మాత్రమే అడ్మిషన్లకు పరిగణింపబడతారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందన్నారు. ఎంపికైన విద్యార్థుల పేర్లను స్థానిక కెజిబివి నోటీసు బోర్డులో కూడా చూడవచ్చని చెప్పారు. దరఖాస్తుల సమాచారం కోసం 7075159996 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరం బళ్లారి చౌరస్తా సమీపంలోని నిర్మల్ నగర్‌లో నెలకొన్న తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కాలనీ ప్రతినిధులు చాంద్‌బాషా, నారాయణ, ఇక్బాల్ హుస్సేన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పిపిఎస్ఎస్ ప్రతినిధి బృందం స్థానికులతో కలిసి బుధవారం కాలనీలో పర్యటించిన నాయకులకు ప్రజలు సమస్యలను వివరించారు. ప్రతి రోజు నీళ్ల వదలాలని మూడేళ్లుగా కాలనీ వాసులు అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. రోజు నీళ్ల వదలకపోగా.. రోజు విడిచి రోజు వదులుతున్న తాగునీరు సమయాన్ని తగ్గించడం సమంజసం కాదన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ప్రతిరోజు తగినన్ని నీళ్ల వదలాలని కోరారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, ఎన్ పరమేష్ మాట్లాడుతూ నిర్మల్ నగర్‌లో నీళ్ల ట్యాంకు సమీపంలో ఉన్న గృహాలకు తగినన్ని నీళ్ల ఎందుకు సరఫరాచేయలేకపోతున్నారని ప్రశ్నించారు. అవసరమైతే ఈ ప్రాంతంలో మరో ట్యాంక్ నిర్మించాలని కోరారు. నగరంలో తగినన్ని నీళ్ల ట్యాంకులున్నాయని తెలిపారు. నిర్వహణలో ఎక్కడో లోపం ఉందన్నారు. కమిషనర్, సూపరింటెండెంట్ ఇంజనీర్ జోక్యం చేసుకొని అన్ని కాలనీల ప్రజలకు తగినన్ని నీళ్ల సరఫరా అయ్యేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. పర్యటనలో శ్రీరాములు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

ఉపాధి వేతనాలు చెల్లించాలి : వ్యకాస

ప్రజాశక్తి - తుగ్గలి

ఉపాధి వేతనాలు సకాలంలో చెల్లించాలని వ్యకాస మండల అధ్యక్షులు జి.శ్రీరాములు కోరారు. బుధవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక సభలో అడిషనల్ పీడీకి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ... మండలంలోని చాలా గ్రామాల్లో ఉపాధి పని చేసి రెండు నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదని తెలిపారు. ఇక్కడి ప్రజలు ప్రతేడాది వలస వెళ్తుంటారని, ఇక్కడే ఉండి పనులు చేసిన వారికి ఈ విధంగా డబ్బులు ఇవ్వకపోవడం దారుణమని చెప్పారు. ఉపాధి హామీ కూలీలను దృష్టిలో పెట్టుకొని వేతనాలు చెల్లించాలని కోరారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - వెల్దుర్తి

వెల్దుర్తి బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాయడానికి వచ్చిన విద్యార్థులకు ఎస్ఐ అశోక్ సహకారంతో పోలీసు సిబ్బంది బుధవారం మజ్జిగ పంపిణీ చేశారు. విద్యార్థులు ఎస్ఐకి కృతజ్ఞతలు తెలిపారు. ఎఎస్ఐ బాలకృష్ణ హెడ్ కానిస్టేబుల్ రాముడు, దేవదానం పాల్గొన్నారు.

'కెవిఆర్'లో జాబ్ మేళా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

క్లస్టర్ యూనివర్సిటీ కెవిఆర్ మహిళా కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్‌లో బుధవారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. అందులో దాదాపు 200 మంది పాల్గొనగా 123 మంది కెవిఆర్ కళాశాల విద్యార్థినులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వివిఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకట రెడ్డి తెలిపారు. జెకెసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మహబూబ్ బాష, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ జి.మహబూబ్ బాష, జెకెసి మెంటర్ ఈశ్వర్, స్వర్ణ లత పాల్గొన్నారు.

హైస్కూల్‌లో భోజన శాల ప్రారంభం

ప్రజాశక్తి - సిబెళగల్

మండలంలోని ముడుమాల హైస్కూల్‌లో నాయకంటి వెంకట ప్రతాప్ రెడ్డి భోజన శాలను ఆయన మనవళ్లు, మనవరాళ్లు, అల్లుడు బుధవారం ఘనంగా ప్రారంభించారు. ప్రతాప్ రెడ్డి సతీమణి మాణిక్యమ్మల స్మారకార్థం విద్యార్థులకు శాశ్వతంగా భోజన శాలను ఏర్పాటు చేయాలన్న కుమారుడు రాధాకృష్ణా రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణ చైతన్య రెడ్డి కల నెరవేరలేదని తెలిపారు. వీరి మరణ అనంతరం కుమారులు పవన్ రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, మేఘనా రెడ్డి, ఉమా మహేశ్వర్ రెడ్డిలు సుమారు రూ.7 లక్షలు వెచ్చించి 130 అడుగుల పొడవునా 30 అడుగుల వెడల్పు ఈ భోజన శాలను నిర్మించడంతో ఘనంగా ప్రారంభం చేశారు. గ్రామ పెద్దలు జగదీశ్వర రెడ్డి పాల్గొని అవసరమైనన్ని ఫ్యాన్లు ఇస్తానని అన్నారు. అలాగే కొండాపూరం గ్రామ పెద్దలు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు గోపాల్ రెడ్డి దంపతులు భోజన టేబుళ్లు బహుకరిస్తామని తెలిపారు. ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు మంజుల, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్ గౌడ్, నాయక్, హుస్సేన్ పాల్గొన్నారు.



భోజన శాలను ప్రారంభిస్తున్న పవన్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, మేఘనారెడ్డి

మాట్లాడుతున్న జెసి డాక్టర్ నవ్య

భూ సమస్యలకు సత్వర పరిష్కారం : జెసి

ప్రజాశక్తి - ఆదోని

జిల్లాలో రీసర్వే గ్రామ సభ, రెవెన్యూ సదస్సుల్లో నమోదైన భూ సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతున్నట్లు జెసి డాక్టర్ బి.నవ్య తెలిపారు. బుధవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జిల్లా కార్యాలయం అధికారులు, ఎమ్మిగనూరు, ఆదోని తహాశీల్దార్లతో కలిసి రీసర్వే జరిగిన గ్రామాల్లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో అధికంగా వచ్చిన ఫిర్యాదులపై గ్రామ సభలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతుల పట్టా భూములు.. ఇనాం భూములుగా నమోదవడం వల్ల ఎదురైన సమస్యలను క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేసి పరిశీలించి పరిష్కరించినట్లు చెప్పారు. ఎమ్మిగనూరు మండలం కడివెల్ల, కందనాతి, ఆదోని మండలం కుప్పగల్, ఢణాపురం, నారాయణపురం గ్రామాల్లో 303 మంది రైతుల భూ సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఎలాంటి సమస్యలూ తలెత్తకుండా సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని సూచించారు. ఆదోని తహాశీల్దార్ శివరాముడు, ఎమ్మిగనూరు తహాశీల్దార్ శేష ఫణి, జిల్లా కార్యాలయం అధికారులు వేణు గోపాల్ శర్మ, వెంకటేశ్వర్లు ఉన్నారు.

వైసిపి మండల ఉపాధ్యక్షులుగా చికెన్ రాజా



ఎంపిపి, జిల్లా కార్యదర్శిని సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- గోనెగండ్ల

వైసిపి మండల ఉపాధ్యక్షులుగా చికెన్ రాజా (దాదా సాహెబ్), మండల కార్యనిర్వాహక సభ్యులుగా అల్లబండ సత్తార్ ఎంపికయ్యారు. తమపై నమ్మకం ఉంచి తమను ఈ పదవులకు నియమించిన వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక, గోనెగండ్ల ఎంపిపి నసురుద్దీన్, కార్యదర్శి టికె.బందే నవాజ్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం వారు స్థానిక ఎంపిపి కార్యాలయంలో ఎంపిపి నసురుద్దీన్, వైసిపి జిల్లా కార్యదర్శి టికె.బందే నవాజ్‌ను శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పార్టీ ఆశయాలను ప్రజలకు చేరవేసి మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. కె.పద్మనాభం, గోవిందు, నదీముల్లా, బగిలి రఫీ, హైదరాబాద్ వలీ పాల్గొన్నారు.

వినియోగదారుల ప్రయోజనాలే లక్ష్యం

- ఎల్ఐసి కడప మార్కెటింగ్ మేనేజర్ శ్యామ్ సుందర్ రావు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మాట్లాడుతున్న శ్యామ్ సుందర్ రావు

వినియోదారుల ప్రయోజనాలు కాపాడడమే ఎల్ఐసి లక్ష్యమని ఎల్ఐసి కడప మార్కెటింగ్ మేనేజర్ పి.శ్యామ్ సుందర్ రావు తెలిపారు. బుధవారం ఎల్ఐసి బ్రాంచి కార్యాలయంలోని సమావేశ భవనంలో ఎల్ఐసి డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎల్ఐసిలో పెన్షన్ పాలసీలు, సింగిల్ ప్రీమియం పాలసీలు, దీర్ఘకాలిక ప్రయోజనాలతో కూడిన స్వల్పకాలిక ప్రీమియం చెల్లింపు పాలసీలు, దీర్ఘకాలిక ప్రీమియం చెల్లిస్తూ దీర్ఘకాలిక ప్రయోజనాలతో కూడిన పాలసీలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నూతనంగా వచ్చే మార్పులను ఎల్ఐసి ఏజెంట్లు పాలసీదారుని దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ప్రస్తుతం వినియోదారుడు, పాలసీదారుడు స్వల్పకాలిక ప్రీమియం పాలసీలను కోరుతున్నారని, వాటిని విస్తృతంగా తీసుకెళ్లాలని తెలిపారు. ఆర్థిక సంవత్సరం ముగింపు దశలో ఉన్నామని, ఎల్ఐసి ఏజెంట్లు విస్తృతంగా వ్యాపారాన్ని చేయాలని చెప్పారు. కడప మేనేజర్ సేల్స్ పి.సోల్మాన్ రాజ్, ఎల్ఐసి బ్రాంచి మేనేజర్ పుల్లి నాయక్, అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

'పది' పరీక్షలను పర్యవేక్షించిన ఎంఇఒ

ప్రజాశక్తి - కౌతాళం

పదో తరగతి పరీక్షలను ఎంఇఒ-2 శోభారాణి పర్యవేక్షించారు. బుధవారం జిల్లా పరిషత్ హైస్కూల్, కస్తూరిబాయి గాంధీ బాలికల పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రతిభ హైస్కూల్‌లో పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 898 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 880 మంది హాజరయ్యారని తెలిపారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు అంజిబాబు
- ప్రజాచైతన్య యాత్ర

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎమ్.డి.అంజిబాబు, సిపిఎం నాయకులు తిక్కన్న డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని మాధవరం, చెట్నిహల్లి, మంత్రాలయం గ్రామాల్లో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తుంగభద్ర నది పక్కనే ప్రవహిస్తున్నా మాధవరం గ్రామంలో ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. మంగళవారం మండలంలోని కల్లుదేవకుంట గ్రామంలో కూడా తాగునీటి సమస్యపై మహిళలు రోడ్డెక్కిన పరిస్థితి ఉందని చెప్పారు. మాధవరం గ్రామం దళిత కాలనీలో

మంత్రాలయంలో మాట్లాడుతున్న అంజిబాబు

డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, సిమెంట్ రోడ్లు వేసినప్పటికీ కాలువలు మురుగునీటి పారుదల లేక అలాగే నిలిచిపోతోందని తెలిపారు. దుర్వాసనతో దోమలు, ఈగలు వ్యాప్తి చెంది వ్యాధులు ప్రబలడానికి కారణం అవుతున్నాయని చెప్పారు. మాధవరంలో ఇళ్లస్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. ఇళ్ల స్థలాలు, తాగునీటి సమస్యను పరిష్కరించాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఈనెల 24న మండల కార్యాలయం దగ్గర ధర్నా చేపడుతున్నట్లు చెప్పారు. సిపిఎం మండల కార్యదర్శి జయరాజు, మండల నాయకులు మారెప్ప, సురేష్, ఇజ్రాయిల్, శ్రీనివాసులు, ప్రాణేష్, లక్ష్మన్న, ఆంధ్రయ, అంజి పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని 10వ వార్డు చంద్రయ్య కొట్టాలలో శిథిలావస్థకు చేరిన పాఠశాలను వెంటనే పునర్ నిర్మించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పి.గోవిందు, సిపిఎం నాయకులు రమేష్, సుభాన్, పరమేష్, బజారి డిమాండ్ చేశారు. పట్టణంలో సిపిఎం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. స్థానికంగా రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు సిపిఎం బృందానికి వివరించారు. పాముల భయం ఎక్కువగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ఎమ్మెల్యే బీవీ పాఠశాల నిర్మాణ విషయంలో జోక్యం చేసుకుని నిర్మిస్తారని స్థానికులు ఆశిస్తున్నారని తెలిపారు. శివారు ప్రాంతం కావడం వల్ల పట్టణంలోని మురుగునీరు ప్రవహించడంతో దుర్గంధం, దోమల బెడదతో వ్యాధుల బారిన పడుతున్నారని చెప్పారు. మున్సిపల్ అధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రొక్లెయిన్‌తో కంప చెట్లను తొలగించాలని తెలిపారు. చంద్రయ్య కొట్టాల ప్రజల సౌకర్యార్థం ప్రాథమిక పాఠశాల నుంచి గూడూరు బైపాస్ రోడ్డుకు లింక్ చేస్తూ వంకపై బ్రిడ్జి రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. మాబాష, బడేసా, బాబు, జైతున్ బీ, కమ్రున్నీసా, బేగం, బాష, మాదన్న, జలీల్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్, తెలుగు యువత జిల్లా మాజీ అధ్యక్షులు మేకల రవియాదవ్‌లు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పశ్చిమ ప్రాంతమైన ఆలూరు నియోజకవర్గ సమస్యలపై ఆయనకు విన్నవించారు. వేదవతి, నగరడోన రిజర్వాయర్‌కు నిధులు కేటాయించాలని కోరారు.

'ఎల్ఐసి పాలసీలపై జిఎస్‌టి ఎత్తేయాలి'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎల్ఐసి పాలసీలపై జిఎస్‌టి ఎత్తేయాలని, ఏజెంట్ల సమస్యలను పరిష్కరించాలని లియాఫీ 1964 ఆల్ ఇండియా, జోనల్ డివిజన్ బ్రాంచి నాయకులు రమేష్, ఆంధ్రయ్య, రామన్న, బుర్లి జయరాం, హరినాథ్ డిమాండ్ చేశారు. బుధవారం లియాఫీ 1964 (ఎల్ఐసి ఏజెంట్ల సంఘం) 'చలో ఢిల్లీ' ధర్నాకు మద్దతుగా ఎల్ఐసి బ్రాంచి కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. కడప డివిజన్ ఉపాధ్యక్షులు ఆంధ్రయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎల్ఐసి ఏజెంట్ల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తోందని, ఎల్ఐసి పాలసీలపై విధించే జిఎస్‌టిని పూర్తిగా ఎత్తేయాలని కోరారు. బ్రాంచి నాయకులు ఏరినాథ్, అబ్దుల్ గఫూర్, జెకె.శివరాముడు, గురురాజ్, ప్రభాకర్, సుధాకర్, నీలకంఠ రెడ్డి, సత్యా రెడ్డి, ఈరన్న, రామచంద్రుడు, కలుగొట్ల చంద్ర, ఆనంద్, లక్ష్మన్న, హరిమోహన్, రాచోటి స్వామి పాల్గొన్నారు.

ఢిల్లీలో సమ్మెకు మద్దతుగా ధర్నా నిర్వహిస్తున్న ఏజెంట్లు

పన్నులు చెల్లించుకుంటే ఆస్తులు జప్తు : కమిషనర్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి, నీటి పన్నులు సకాలంలో చెల్లించకపోతే ఆస్తులు జప్తు చేస్తామని మున్సిపల్ కమిషనర్ కృష్ణ, రెవెన్యూ అధికారి నాసిర్ హుస్సేన్ హెచ్చరించారు. బుధవారం ఆదోనిలోని పలు షాపింగ్ మాళ్లను సందర్శించి టాక్స్ చెల్లించాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. ఈనెల చివరిలోపు సుమారు రూ.8 కోట్ల పన్నులు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. కొందరు లక్షలాది రూపాయలు చెల్లించాల్సి ఉందని, అలాంటి వారిని గుర్తించి ఇప్పటికే వాటర్ సరఫరా నిలిపివేశామని తెలిపారు. ఈనెల చివరిలోపు చెల్లించకపోతే ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరించారు. ఆర్ఐ చంద్రమోహన్ ఉన్నారు.

సీజనల్ హాస్టల్‌లో అవినీతిపై విచారణ చేపట్టాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఆదోని

సీజనల్ హాస్టల్‌లో జరుగుతున్న అవినీతిపై విచారణ చేపట్టి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జెసి డాక్టర్ నవ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో అనేక కుటుంబాలు వలసలు వెళ్తుంటే రాష్ట్ర ప్రభుత్వం వారి పిల్లల కోసం మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ, మంత్రాలయం, కోడుమూరు ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేసిందని తెలిపారు. విద్యార్థులకు భోజన వసతులు ఏర్పాటు చేయకుండా తప్పుడు హాజరు వేసుకొని రూ.వేలకు వేల నిధులు కాజేస్తున్నారని విమర్శించారు. విచారించి అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హాస్టల్‌కు రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకు రాష్ట్ర ప్రభుత్వం మెయింటనెన్స్ కోసం నిధులు పంపుతుంటే హాస్టల్ నిర్వహణ తూతూమంత్రంగానే ఉందని తెలిపారు. కౌతాళంలో ఉన్న హాస్టల్‌లో విద్యార్థులను మధ్యాహ్నం ఇంటికి పంపించి మళ్లీ సాయంత్రానికి పిలుచుకొస్తున్నామని అక్కడ ఉన్న ట్యూటర్ చెప్పారని అన్నారు. కలెక్టర్ స్పందించి అన్ని సీజనల్ హాస్టళ్లను సందర్శించాలని డిమాండ్ చేశారు. నాయకులు ఉమాకాంత్, నరసింహ, చిరు, రాజు ఉన్నారు.

ఈతకు వెళ్లి బాలుడు మృతి

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరిలోని సచివాలయం వెనుక వైపు ఉన్న పెద్ద బావిలో ఈతకు వెళ్లిన బాలుడు సుభాష్ (14) మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. చిప్పగిరి గ్రామానికి చెందిన రోషప్ప గారి నాగవేణి, సత్యన్న దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఈతకు వెళ్లిన సుభాష్ బావిలో మునిగిపోయాడు. సాయంత్రానికి ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు, బంధువులు ఆందోళన చెందుతూ, బావి దగ్గరికి వెళ్లి పరిశీలించారు. బావి దగ్గర బాలుడు వేసుకున్న దుస్తులు ఉండడంతో తల్లిదండ్రులకు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. చిప్పగిరి ఎస్ఐ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు, ఫైర్ సిబ్బంది గాలింపు చేపట్టారు. గుంతకల్‌కు చెందిన ఫైర్ స్టేషన్ బృందం చొరవతో మృతదేహాన్ని బయటికి తీశారు. అనంతరం గుంతకల్ ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ప్రథమ కుమారుడు సుభాష్ ఈతకు వెళ్లి మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. బుధవారం సంఘటన స్థలాన్ని తహాశీల్దార్ ఇజాజ్ అహ్మద్, సిఐ రవిశంకర్ రెడ్డి, ఎస్ఐ సతీష్ కుమార్ పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీశైలం యాత్రికులకు అన్నదానం

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని ఆర్లబండ గ్రామానికి చెందిన దత్తాత్రేయ ఆధ్వర్యంలో శ్రీశైలం పాదయాత్ర భక్తులకు 11వ సంవత్సరం అన్నదానం ఏర్పాటు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. బుధవారం గ్రామంలో అన్నదాన కార్యక్రమానికి ఆర్లబండ గ్రామంతో పాటు పక్కనున్న గ్రామాలు కూడా సహకరిస్తున్నాయన్నారు. అన్నదాన కార్యక్రమానికి సహకరిస్తున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

కోసిగి ఎస్ఐగా హనుమంత రెడ్డి

ప్రజాశక్తి - కోసిగి

కోసిగి ఎస్ఐగా హనుమంత రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన విఆర్ నుంచి కోసిగికి బదిలీల్లో భాగంగా వచ్చారు. గతంలో పని చేసిన ఎస్ఐ చంద్రమోహన్ కర్నూలు మూడో పట్టణానికి బదిలీ అయ్యారు. ఎస్ఐ ముందుగా గ్రామంలో వెలిసిన శ్రీరేణుక ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. మండల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా ఉండి జీవనం సాగించాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

జిఒలు, సెక్షన్లతో రవాణా రంగం కుదేలు

- ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్

ప్రజాశక్తి - కోసిగి

వివిధ రకాల జిఒలు, సెక్షన్లతో రవాణా రంగం కుదేలవుతోందని ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ తెలిపారు. కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రవాణా కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 24న జరిగే 'చలో ఢిల్లీ'లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. బుధవారం ఆల్ ఇండియా

కోసిగిలో మాట్లాడుతున్న ప్రభాకర్

రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జీపుజాతా నిర్వహించారు. కోసిగి వచ్చిన సందర్భంగా బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. డ్రైవర్లను జైలు పాలు చేసే సెక్షన్లు 106-1/2ను రద్దు చేయాలని, జిఒ 21ని రద్దు చేయాలని కోరారు. చలానా ధరలు తగ్గించాలని, కార్మిక హక్కులను కాలరాసే ప్రమాదకర లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెట్రోలు, డీజిల్ ధరలు, ఇన్స్యూరెన్స్ ధరలు తగ్గించాలని తెలిపారు. ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్లను రద్దు చేసి, వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలను ఆర్‌టిఎ కార్యాలయంలోనే కొనసాగించి, సెన్సార్ విధానాన్ని రద్దు చేసి, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో యూనియన్ జిల్లా నాయకులు మోహిద్దీన్, నాగరాజు, సిఐటియు మండల కార్యదర్శి రాముడు, రైతుసంఘం మండల కార్యదర్శి వీరేష్, ఆటో యూనియన్ నాయకులు వెంకటేష్, మురళీ, చిన్నన్న పాల్గొన్నారు. **ఆలూరు** అంబేద్కర్ సర్కిల్‌లో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి అధ్యక్షతన ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడారు. డ్రైవర్లకు పిఎఫ్, ఈఎస్ఐ, పింఛను అమలు చేయాలని కోరారు. జిల్లా నాయకులు నాగరాజు, విఠల్, నాగరాజు, ఆటో నాయకులు శీను, గౌడ్, ఎల్లప్ప, ఈరన్న పాల్గొన్నారు.

ఆలూరులో మాట్లాడుతున్న నారాయణ స్వామి

'సమయానికి బస్సు నడపాలి'

ప్రజాశక్తి - ఆదోని

మేకడోణ, బల్లేకల్ గ్రామాల విద్యార్థులకు అనుకూలమైన సమయానికి విద్యార్థి బస్సు నడపాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. మేకడోణ, బల్లేకల్, పెద్దతుంబలం గ్రామాల విద్యార్థులకు విద్యార్థి బస్సు సమయానికి నడపాలని కోరుతూ బుధవారం ఆదోనిలోని ఆర్‌టిసి సిఐ మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు ఉమాకాంత్, చిరు, నవీన్ మాట్లాడారు. విద్యార్థి బస్సు సమయానికి రాకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బస్సు ఆలస్యం కావడంతో విద్యార్థులు సమయానికి పాఠశాల, కళాశాలకు చేరుకోలేక పోతున్నారన్నారు. నాయకులు నాగరాజు, గౌస్, నవీన్, నరసింహ, పరమేష్ పాల్గొన్నారు.

కనుల పండువగా బోనాల ఊరేగింపు

ప్రజాశక్తి -దేవనకొండ

మండలంలోని గద్దెరాళ్ల మారెమ్మ దేవర ఉత్సవాలు కనుల పండువా సాగాయి. బుధవారం గ్రామానికి చెందిన తలారి వంశస్తుల ఇంట్లో నుంచి దేవత విగ్రహాల ఆభరణాలను తీసుకెళ్లి అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తాదులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాల్లో నైవేద్యాన్ని సమర్పించారు. ఉత్సవాల్లో పల్లెదొడ్డి బోనాల ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణీయంగా నిలిచింది. ఆ గ్రామానికి చెందిన 295 మంది మహిళలు వరుస క్రమంలో నెత్తిన బోనాలు పెట్టుకుని డప్పు వాయిద్యాలతో పొట్టేళ్ల సందడితో పిల్లలు, పెద్దలు నడిచి వచ్చిన దృశ్యాలు ఆకట్టుకున్నాయి. ఉత్సవాలను తిలకించడానికి తెలుగు రాష్ట్రాల నుంచే కాక మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలి వచ్చారు. ఉత్సవాల్లో ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, దేవనకొండ మాజీ జడ్‌పిటిసి కోట్ల హరిచక్రపాణి రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా సిఐ వంశీ నాథ్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఉత్సవాలను తిలకించడానికి తరలివచ్చిన వాహనదారుల రాకపోకలకు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంలో పోలీసు సిబ్బంది విఫలమైనట్లు పలువురు విమర్శించారు.

పాఠశాల భవనాల నిర్మాణం పూర్తి చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని హెచ్.కైరవాడి, కులుమాల, చిన్నమరివీడు, పుట్టపాశం, వెముగోడు గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనాలను వెంటనే పూర్తి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సాయి ఉదయ్, గోనెగండ్ల మండల అధ్యక్షులు పవన్ తేజ కోరారు. బుధవారం వారు ఆయా గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ... మండలంలోని వివిధ గ్రామాల్లో అదనపు తరగతి గదులు, నూతన పాఠశాల భవన నిర్మాణ పనులు ఏళ్ల తరబడి జరుగుతున్నాయని తెలిపారు. అధికారులు వాటిని వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆస్పరి ఎస్ఐ సస్పెండ్..!

- చిత్తూరు జిల్లా సోమల పోలీసు స్టేషన్ అక్రమ కేసులపై వేటు
- స్వంత సామాజికవర్గ రిపోర్టర్లు, ప్రజాప్రతినిధి సిఫార్సుతో ఆలూరుకు బదిలీ

ప్రజాశక్తి - ఆలూరు

ఆస్పరి అటాచ్డ్ ఎస్ఐ సి.వెంకట నరసింహులును సస్పెండ్ చేస్తూ అనంతపురం రేంజ్ డిఐజి షిమోషీ ఆదేశాలు ఇచ్చారు. వైసిపి ప్రభుత్వంలో చిత్తూరు జిల్లా సోమల పోలీసు స్టేషన్ పరిధిలో అక్రమ కేసులు బనాయిస్తూ, అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు విచారణలో బహిర్గతం కావడంతో సస్పెండ్ చేసినట్లు తెలిసిందే.

ప్రభుత్వం మారిన తర్వాత ముందు జాగ్రత్తగా ఎస్ఐ తన సామాజిక వర్గానికి చెందిన ఆలూరు జర్నలిస్టులు, ప్రజాప్రతినిధికి సిఫార్సు చేసి ఆలూరు స్టేషన్‌కు ఎస్ఐగా బదిలీ చేయించుకున్నారు. బాధ్యతలు తీసుకున్న నాలుగు నెలల్లోనే అక్రమ కేసులు, అక్రమ వసూళ్లకు పాల్పడ్డారు. జిల్లా ఉన్నతాధికారులు విఆర్‌కు పంపుతున్నట్లు పంపుతూ ఆస్పరికి బదిలీ చేశారు. ఆలూరు స్టేషన్‌కు వచ్చిన బాధితుల ఫిర్యాదుల మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటే స్టేషన్ చుట్టూ ప్రదక్షిణలు చేసి అలిసిపోయిన బాధితులు ఎస్ఐ అడిగినంత ముడుపులు ముట్టచెప్పాల్సిందే. ఆ ముడుపులు కూడా తన సామాజిక వర్గానికి చెందిన నాయకులు మధ్యవర్తిగా ఉంటూ వసూలు చేస్తున్నట్లు బహిరంగానే చర్చ జరిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ చేసిన ఆయా కేసుల్లో ఉన్న ప్రత్యర్థులతో మంతనాలు జరిపి స్టేషన్ బెయిల్ లేదా కౌంటర్ కేసు నమోదు చేసి ఇరువురి దగ్గర ముడుపులు తీసుకున్నట్లు సమాచారం. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు ముందుగా జర్నలిస్టులు లేదా నాయకులతో కలిసి రావాలని తెలుపుతాడు. ఒక మహిళ (కెడి), మహిళా బాధితురాలికి మాయమాటలు చెప్పి బంగారు నగలు, వెండి దోచికెళ్లిన కేసులో నిందితురాలితో పాటు మరో ముగ్గురిని ఈ కేసు నుంచి తప్పించేందుకు దళిత నాయకునితో మంతనాలు జరిపి ముగ్గురితో కలిసి రూ.4 లక్షలు తీసుకున్నట్లు సమాచారం. ఫిర్యాదు చేసిన బాధిత మహిళకు బంగారు నగలు రికవరి చేసి ఇచ్చేందుకు రూ.80 వేలు తీసుకున్నా, బాధితురాలికి బంగారు నగలు చేతికి అందలేదని తెలిసింది. మండలంలోని కురుకుంద గ్రామంలో బంధువుల మధ్య భూ తగాదాలతో ఫిర్యాదుదారులు ప్రయివేట్ కేసు వేశారు. ఈ కేసులో ఉన్న ప్రత్యర్థులకు స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు రూ.20 వేలు తీసుకున్నట్లు సమాచారం.

దళిత మహిళ తన సమస్యపై ఫిర్యాదు చేయగా 20 రోజులుగా స్టేషన్ చుట్టూ తిప్పించుకొని ప్రత్యర్థిపై 'ఎఫ్ఐఆర్ చేస్తాను. స్టేషన్‌కు రమ్మని రాత్రి 9 గంటలకు పిలిచారు. రాత్రి 11.30 గంటలు కావడంతో స్టేషన్‌లో ఉన్న పోలీసు సిబ్బందిని, మరో నిందితుని కోర్టులో హాజరు పరిచేందుకు పంపించారు. అక్కడే దళిత మహిళకు తోడుగా వచ్చిన తల్లిని బయట కూర్చోబెట్టి దళిత మహిళను తన ముందు ఫిర్యాదు రాయాలని చెప్పి అసభ్యంగా ప్రవర్తించినట్లు, మహిళ తీవ్రంగా వారించి తమ బంధువులకు తెలుపుతానని చెప్పడంతో మరుసటి రోజు ఎఫ్ఐఆర్ కాపీ కోసం రావాలని పంపించినట్లు తెలిసింది. ఈ విషయం బయటికి చెప్పేందుకు తల్లి, కూతుళ్లు భయాందోళనకు గురయ్యారు. ఈ కేసులో ప్రత్యర్థిపై ఎఫ్ఐఆర్ చేసేందుకు రూ.30 వేలు తీసుకొని, మరో రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు సమాచారం. ఒక యువకుడు బైక్‌పై వస్తుండగా ఆ యువకుని పట్టుకొచ్చి స్టేషన్‌లో ఉంచుకొని అతని బంధువులకు కర్ణాటక మద్యం తెచ్చి కేసు రాయించుకోవాలని, లేకపోతే గంజాయి కేసు నమోదు చేసి జైలుకు పంపుతానని భయపెట్టినట్లు తెలిసింది. ఆ యువకుని బంధువులు గత్యంతరం లేక కర్ణాటక టెట్రా ప్యాకెట్లు 4 బాక్సులు స్టేషన్‌కు తీసుకొచ్చి కేసు నమోదు చేయించుకొని రిమాండ్‌కు వెళ్లినట్లు సమాచారం. ఆన్‌లైన్ గేమ్ ఆడుతున్నారనే నెపంతో భయపెట్టి ఒకరితో రూ.50 వేలు డిమాండ్ చేయగా రూ.25 వేలు ఇచ్చినట్లు తెలిసింది. మిగిలిన మొత్తం కట్టి సెల్ తీసుకెళ్లాలని బాధితుని సెల్ తీసుకున్నట్లు సమాచారం. ఇలాంటి పోలీసుల వల్ల పోలీసు వ్యవస్థకే మాయనిమచ్చ అని స్థానికులు పేర్కొంటున్నారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి పోలీసు అధికారిపై, సహకరించిన జర్నలిస్టులు, నాయకులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

కలెక్టరేట్ వద్ద ఉన్న వైసిపి కౌన్సిలర్లు

ఆదోని మున్సిపల్ ఛైర్మన్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి - ఆదోని

మున్సిపల్ ఛైర్మన్ శాంతపై అవిశ్వాసం తీర్మానం పెట్టేందుకు వైసిపి కౌన్సిలర్లు బుధవారం కర్నూలు తరలి వెళ్లారు. వైసిపి తరపున 34 మంది కౌన్సిలర్లు ప్రస్తుతం ఉన్న ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు అనుమతి ఇవ్వాలని కలెక్టర్ రంజిత్ బాషాకు వినతిపత్రం అందజేశారు. వైసిపి ద్వారా గెలిచి ఛైర్మన్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన శాంత కూటమి ప్రభుత్వం రాగానే ఆమె భర్త సింహం నాగేంద్ర బిజెపిలో చేరారు. ఆగ్రహించిన వైసిపి కౌన్సిలర్లు ఆమెపై తిరుగుబాటు బావుట ఎగురవేశారు. ఈ నేపథ్యంలోనే వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్వి.మోహన్ రెడ్డి, ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి సారథ్యంలో 34 మంది కౌన్సిలర్లు ఛైర్మన్ శాంతకు వ్యతిరేకంగా తీర్మానం చేసి కలెక్టర్‌కు అందజేసినట్లు వైస్ ఛైర్మన్ నరసింహులు తెలిపారు. ఛైర్మన్‌గా సిహెచ్.లోకేశ్వరిని బలపరుస్తున్నట్లు చెప్పారు. అవిశ్వాస ప్రక్రియకు అధికారులు ఏర్పాట్లు చేయాల్సి ఉంది.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు : కెవిపిఎస్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని కెవిపిఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.తిమ్మన్న, చిన్నప్ప, రాజా రమేష్, చర్మ కళాకారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సుమాల ఆంథోని, సుమాల రాజు తెలిపారు. బుధవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో కెవిపిఎస్, చర్మకారుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. డప్పు కళాకారుల పింఛను సమస్యలను పరిష్కరించాలని, డప్పు కళాకారులకు కూడా రూ.7 వేల పింఛను ఇవ్వాలని కోరారు. పింఛను వయస్సు 45 ఏళ్లకు తగ్గించాలని తెలిపారు. విజయవాడ నగరంలోని ధర్నా చౌక్‌లో మహాధర్నా నిర్వహించినట్లు చెప్పారు. డప్పు కళాకారుల సమస్యలను అసెంబ్లీలో చర్చించాలని ధర్నా చౌక్ దగ్గర ధర్నా చేస్తున్న నాయకులను అడ్డగించి.. డప్పు కళాకారులను భయపెట్టేలా నిర్బంధంగా ఈడ్చుకుంటూ లాకెళ్లడం సరైంది కాదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం డప్పు కళాకారుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కెవిపిఎస్ నాయకులు రాముడు, ఎం.ఆనంద్, ఎం.నల్లన్న, బాబు పూజారి, రంగస్వామి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

శ్రీశైలానికి కర్ణాటక స్వామిజీ పాదయాత్ర

ప్రజాశక్తి - హాలహర్వి

కర్ణాటక రాష్ట్రం హొన్నాళ్లి నుంచి కర్నూలు జిల్లా శ్రీశైలానికి హిరేకల్ మఠం డాక్టర్ చన్న మల్లికార్జున శివాచార్య స్వామిజీ పాదయాత్ర చేపట్టారు. ఈ యాత్ర మంగళవారం రాత్రి ఆంధ్ర సరిహద్దు గ్రామమైన హాలహర్వి చేరుకుంది. బుధవారం హాలహర్వి వద్ద భక్తులతో మొక్కలు నాటి పాదయాత్రను ప్రారంభించారు. వచ్చే ఏడాది మొక్క బాగా పెరిగి పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు, ప్రజలకు నీడను అందించాలని ఆకాంక్షించారు. ఆయా గ్రామాల్లో పర్యావరణ చైతన్యం కల్పించడం పాదయాత్రలో మరో భాగమన్నారు. ఈనెల 24లోపు కోదాడగుడ్డ శ్రీవీరభద్ర స్వామిని దర్శించుకుని 650 కిలోమీటర్ల దూరంలోని శ్రీశైల మల్లికార్జున స్వామిని దర్శించుకోవాలని అనుకున్నామని చెప్పారు. కర్జగి శివయోగి శివాచార్య స్వామిజీ, కురువ శివకుమార్ స్వామి, అన్నదానయ్య శాస్త్రి, టిఎం.హాలస్వామి, చంద్రశేఖర శివాచార్య స్వామిజీ పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం

- నిరుపయోగంగా బస్టాండ్ : సిపిఎం

ప్రజాశక్తి - కౌతాళం

బస్టాండ్‌ను పరిశీలిస్తున్న నాయకులు

జిల్లాలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాల్లో ఒకటైన శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రంలో అధికారుల నిర్లక్ష్యంతో బస్టాండ్ నిరుపయోగంగా మారిందని సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య, మండల కన్వీనర్ ఈరన్న విమర్శించారు. బుధవారం సిపిఎం నాయకరులు ఉరుకుందలోని బస్టాండ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన బస్టాండ్ నిరుపయోగంగా ఉండడంతో ప్రజాధనం వృథా అవుతోందని, శ్రీఈరన్న స్వామి దర్శనం కోసం రాష్ట్రం నుంచే కాక తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారని తెలిపారు. ప్రస్తుతం కర్ణాటక, ఆంధ్ర బస్సులు బస్టాండ్‌లోకి రాకుండా ఆర్చిగేటు దగ్గరే ఆగి తిరిగి వెళ్తుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. భక్తులు తిరుగు ప్రయాణం కోసం రోడ్లపై నిలిచి ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బస్టాండ్ ఉన్నా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారంటే అధికారుల నిర్లక్ష్యం ఏమేర ఉందో అర్థమవుతుందన్నారు. కుంభాభిషేకం కోసం రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపార సముదాయాలు తొలగించడంతో, బస్సులు బస్టాండ్‌లోకి రావడానికి ఇబ్బందులు లేకపోయినా.. బస్సులు మాత్రం రోడ్డుపై నిలిచి వెళ్తున్నాయని తెలిపారు. అధికారులు స్పందించి బస్టాండ్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలని, బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలు కల్పించి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. లేకపోతే ప్రజలను సమీకరించి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

వైభవంగా శ్రీసుయతీంద్ర తీర్థుల మధ్యారాధన

ప్రజాశక్తి - మంత్రాలయం

పూజలు చేస్తున్న పీఠాధిపతులు

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠం పూర్వపు పీఠాధిపతులు శ్రీసుయతీంద్ర తీర్థుల మధ్యారాధన వేడుకలు వైభవంగా సాగాయి. బుధవారం శ్రీమఠం పీఠాధిపతుల ఆధ్వర్యంలో శ్రీసుయతీంద్ర తీర్థుల 12వ మహా సమారాధన సందర్భంగా రెండో రోజు ఆయన బృందావనాన్ని నిర్మాల్యం చేసి తులసి అర్చనతో మహా పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం బృందావనాన్ని వెండి కవచాలతో, పట్టు వస్త్రాలతో, వివిధ రకాల పూల మాలలు వేసి అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా ప్రాకారంలో స్వర్ణ రథంపై శ్రీసుయతీంద్ర తీర్థుల చిత్రపటాన్ని ఉంచి ప్రత్యేక హారతి ఇచ్చారు. భక్త జనుల మధ్య స్వర్ణ రథోత్సవాన్ని వైభవంగా ఊరేగించారు. అంతకుముందు శ్రీరాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్నికి విశేష పూజలు నిర్వహించి, స్వర్ణ కవచాలు, పట్టు వస్త్రాలతో వివిధ రకాల పూల మాలలు వేసి ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. సంస్థాన పూజల్లో భాగంగా రాఘవేంద్రస్వామి ఆరాధ్య దైవమైన మూల రాములకు దూప దీప నైవేద్యాలు సమర్పించి మంగళహారతులు ఇచ్చారు. మఠం మేనేజర్ వెంకటేష్ జోషి, ధార్మిక అధికారి శ్రీపతి ఆచార్, సహాయ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి, విశ్రాంత ప్రిన్సిపల్ వాదిరాజాచార్, ధార్మిక సిబ్బంది వ్యాసరాజాచార్, కుర్డి జయ తీర్థాచార్ పాల్గొన్నారు.